
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

బుధవారం 29 అక్టోబర్ 2025


## రాయబార కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

సుండుపల్లె, అక్టోబర్ 28, ప్రభాతవార్త :

కువైట్ లోని భారత రాయబారి సంజయ్ ని కలిసిన సందర్భంలో ప్రవాస భారతీయ మహిళ నాగమణి గత కొంత కాలంగా హాస్పిటల్ చికిత్స పొందుతున్న ఆమె ను త్వరగా కోలుకొన్న తర్వాత ఆమె ను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేసి (ఇండియా)వాళ్ల సొంత గ్రామానికి తరలించమని కోరారు. తదనంతరం ఆమె ను నేడు ఆమెను స్వగ్రామానికి తరలించారు ఇందుకు భారత రాయబార కార్యాలయానికి మరియు అంబాసిడర్ సంజయ్ మరియు మదనపల్లి మ్మెల్యే షాజహాన్ భాషాకు ధన్యవాదాలు తెలిపిన కంచన రెడ్డి శేఖర్.




### తుఫాన్ హెచ్చరికలతో
## పాఠశాలలకు సెలవు

ఎడ్యుకేషన్ అక్టోబర్ 28 ప్రభాతవార్త :

మంధా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో.. వైయస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ ఆదేశములు మేరకు జిల్లా నందుగల అన్ని యాజమాన్య మరియు అన్ని కేటగిరీల పాఠశాలలకు ..రేపు అనగా 29.10.2025 ( అనగా బుధవారం) సెలవు ప్రకటించినట్టుగా జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు ఎవరైనా స్టడీ క్లాసుల పేరుతో కానీ, అదనపు తరగతుల పేరుతో కానీ పాఠశాల నిర్వహించిన ఎడల వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకొనబడునని తెలియజేశారు ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లలను ఇంటి వద్ద సురక్షితంగా ఉంచి, బయటకు పంపకుండా జాగ్రత్త వహించవలసినదిగా వివిధ శాఖల సమన్వయంతో తగు సూచనలను అందించాలని సూచించారు.

# జోరుగా గంజాయి అమ్మకాలు

మత్తుకు బానిసలవుతున్న యువత, విద్యార్థులు... గంజాయి పై ఉక్కు పాదం మోపడానికి సిద్ధమైన పోలీసులు


గంజాయి వ్యాపారుల అరెస్టు ( ఫైల్ ఫోటో )


గంజాయి ( ఫైల్ ఫోటో )

మదనపల్లెక్రైమ్, అక్టోబర్ 28 ప్రభాతవార్త.

జిల్లాలో గంజాయి అమ్మకాలు గుట్టుచప్పుడు కాక జోరుగా సాగుతున్నాయి. సిగరెట్టు, మద్యం తాగడం ప్యాషన్‌గా భావించిన కొందరు ఇప్పుడు గంజాయిని మత్తుగా ఎంజాయి చేస్తున్నారు. చదువుకున్న యువత సైతం వీటికి బానిసగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మదనపల్లె, కురబ లకోట, పీలేరు, కె.వి పల్లి, కలకడ కేంద్రంగా గంజాయి వ్యాపారం జోరందుకుని చాపకింద నీరులా విస్తరిస్తోంది. గుట్టు చప్పుడు కాకుండా గంజాయి బ్యాచ్ రూ లక్షల్లో వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో విద్యా ర్థులు, పేద, మధ్య తరగతి యువత గంజాయికి అలవాటు పడీ బానిసలుగా మారుతున్నారు. గంజాయి సులభంగా దొరుకుతుండడంతో యువత వాటిని తాగి మత్తులో తూలుతూ. ఘర్షణలకు దిగడం, అ సాంఘీక కార్యక్రమాలకు పాల్పడడం, దొంగతనాలకు అలవాటు పడుతూ జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. మరి కొంతమంది గంజాయి మత్తులో అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలూ ఉన్నాయి. ఇందుకు ఉదాహరణే చంద్రాకాలనీ కి చెందిన ఓ విద్యార్థి స్కూల్ బ్యాగులో కొడవలి పెట్టుకుని పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థులను బెదిరిస్తూ హల్చల్ చేశాడు. గంజాయి విక్రయదారులు గంజాయి కావాల్సిన వారికి మొబైల్ ఫోన్లలో మాట్లాడుకుని డైరెక్టుగా కాలేజీలు, హాస్టళ్లు, పీజీల్లోకి గంజాయి సరఫరా చేస్తున్నారు. ఇటీవల పోలీసులు పట్టణం, చుట్టు పక్కల ప్రాంతాల్లో దాడులు చేసి పదుల సంఖ్యలో గంజాయి వ్యాపారులతో పాటు గంజాయి తాగుతున్న యువతను ఆరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. బంగారం బాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గంజాయి వ్యాపారుల ధన దాహానికి విద్యార్థులతో పాటు యువతే కాకుండా రోజువారీ కూలిపనులకు వెళ్లే కార్మికులు, పేద, బడుగు జీవులు, బాధితులుగా మారుతు న్నారు. అంతే కాకుండా సామాన్యల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రధానంగా ఇంజనీరింగ్ కాలేజీలు, పీజీలు ఉండే అంగళ్లు కురబలకోట, సర్కార్తోపు, తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ లక్షల్లో గంజాయి వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న గంజాయి బాధితుల్లో ఎక్కువమంది ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులే ఉండటం గమనార్హం.

### అవగాహన అవసరం



ప్రభుత్వం కళాశాలు, పాఠశాలంతో పాటు పలు పబ్లిక్ ఏరియాలలో గంజాయి నిర్వాహణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గంజాయి వల్ల జరిగే పరిణామాలను యువత, విద్యార్థులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాల్సి ఉంది. బిడ్డలను తల్లి దండ్రులు గమనిస్తూ పిల్లల అలవాటులను గమనిస్తూ ఉంటే యువత పెడదారి పట్టకుండా కట్టడి చేయవచ్చు. బిడ్డలను తల్లిదండ్రులు గమనిస్తూ చెడు అలవాట్ల కు బానిసైనట్లు గుర్తిస్తే వైద్యులు తీసుకెళ్లి చికిత్సలు చేయించాల్సిన అవసరం ఉంది. ఆలస్యం చేస్తే గంజాయికి బానిసలుగా మారి, చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉండి సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది.

-డాక్టర్ రాధిక, సైక్రియాటిస్ట్

### స్పెషల్ డ్రైవ్ ధర గంజాయిని అరికడతాం



ఇటీవల కాలంలో రైలు మార్గం ద్వారా గంజాయి సరఫరా జరుగుతున్నట్లు తెలుస్తోంది. మారుమూల ప్రాంతాల్లో గంజాయి నిల్వ చేసి అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే గంజాయి వినియోగంపై ఉక్కు పాదం మోపు తున్నాము. రెండు రోజుల క్రితం 8 మంది గంజాయి వికరయ్య ద్వారా అదుపులోకి తీసుకున్నాము. అలాగే గంజాయికి బానిసలు అయిన వారిని గుర్తించి చిత్తూరులోని రీ హ్యాబిటేషన్ సెంటర్‌లో ఉంచాం. వీరందరికీ 30 రోజులపాటు అక్కడే ఉంచి కౌన్సిలింగ్ ఇవ్వటం జరుగుతుంది. పాఠశాలలు, కళాశాలల వద్ద మఫ్టీలో సిబ్బందిని నియమించి గంజాయి నిర్వహకులపై దృష్టి సారిస్తాం. ప్రజలు పోలీసులకు సహకరించి. గంజాయి సరఫరా, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలి. గంజాయిని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

- మహేంద్ర, డి.ఎస్.పి మదనపల్లె.

## మంత్రిని కలిసిన ఏపిఎన్జిజివో నాయకులు..

కడప కార్పొరేషన్ అక్టోబర్ 28 ప్రభాతవార్త:



మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఏపియన్జిజివో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, అన్నమయ్య జిల్లా హడక్ కమిటీ ఛైర్మెన్ యం వేణుగోపాల్ రెడ్డిలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా హడ్డక్ కమిటీ రాయచోటి ఎన్నికైన సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా నూతనకమిటీ కార్యవర్గనికి మంత్రి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లను దశలవారీగా ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షలు అలపర్తి విద్యా సాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ ఆదేశాలు మేరకు తుఫాన్ సమయంలో ప్రజలకు అందుబాటులోని సేవలు అందిస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో కడప జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసన్, కమిటీ సభ్యులు గణేష్ సంయుక్త కార్యదర్శి పద్మనాభరావు, రాయచోటి కార్యదర్శి మహాదేవ, కోశాధికారి దేవేంద్ర, శివా రెడ్డి, రవి శంకర్, మహాభాషా, గంగాధర్ లు ఉన్నారు.

### భూ వివాదాలకు, సమస్యలకు
## శాశ్వత పరిష్కారం చూపండి..

రెవెన్యూ అధికారులకు ఆదేశాలుచ్చిన మంత్రి మండిపల్లి

రాయచోటి, అక్టోబర్ 28, ప్రభాతవార్త



మంగళవారం రోజు ఉదయం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజల సమస్యలు,అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురిని కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు నాయకులు దుశాలవ, పుష్పగుచ్చమ్మలతో మంత్రిని ఘనంగా సన్మానించారు.

## మహిళ కుటుంబానికి మంత్రి పరామర్శ

రాయచోటి, అక్టోబర్ 28, ప్రభాతవార్త



బనగానపల్లి నుంచి తాడిపత్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బనగానపల్లి నుంచి తాడిపత్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం 10:00 గంటలకు అవుకు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఇందులో అతి స్వల్ప గాయాలపాలైన 14 మంది ప్రయాణికులకు అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.బస్సు డ్రైవర్, మరో ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదంలో 55 ఏళ్ల చాకలి లక్ష్మిదేవి అనే మహిళ మృతి చెందారు ప్రమాదంలో చనిపోయిన బాధిత మహిళ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

## మొంథా తుఫాన్‌తో ప్రాజెక్టులు, లోతట్టు ప్రాంతాలపై అధికారుల ఫోకస్

**పరిశీలించిన కడప, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు**

**ఆదినిమ్మయపల్లి పల్లె ఆనకట్టు వద్ద 11 క్యూసెక్కుల వరద**

**గండికోట, మైలవరం, బుగ్గవంక, ఫించా,వెలిగల్లు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత**

**పంటలను పరిశీలించిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారి**


పల్లంపాడు గ్రామాన్నినీరు చుట్టుగుట్టడంతో చుట్టుముట్టడంతో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాజంపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త:

కడప, అన్నమయ్య జిల్లాలలో మొంథా తుఫాను ప్రభావంతో రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తమయ్యారు. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. స్వయంగా వారే ప్రాజెక్టులను, ప్రమాదకరమైన ప్రాంతాల్లో పరిశీలించారు. పెనగలూరుమండలంలోని పల్లంపాడు గ్రామాన్ని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే తో కలసి పరిశీలించారు. గ్రామాన్ని నీరు చుట్టుపడటంతో నదిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్డిఎఫ్ బృందాన్ని అక్కడే మకాం వేసేలా ఆదేశించారు. ఎటువంటి ఇబ్బంది తలెత్తిన ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది రెండు బోట్లు ద్వారా సాయం అందించడం జరుగుతుందని, ప్రజలు ఎటువంటి పరిస్థితిలోనూ తెప్పలు ఉపయోగించి ఏరు దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. రాజంపేట సబ్ కలెక్టర్ పల్లంపాడు గ్రామ ప్రజలతో నిత్యం పరిస్థితి తెలుసుకుంటూ.. వారికి కావలసిన సాయాన్ని అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని 24/7 మూడు షిఫ్ట్ లు విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖ వారితో సమన్వయం చేసుకొని ఎప్పటికీ అప్పుడు పరిస్థితి నీ సబ్‌కలెక్టర్, పోలీస్ కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలని ఆదేశించారు. గ్రామంలో ప్రజలతో పాటు ఆశ వర్కర్లు, ఏ.ఎన్.ఎం లు మరియు డాక్టర్లు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. పల్లెంపాడు ప్రజలు వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పరిస్థితి లోనూ వాగును దాటకుండా , గ్రామ స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. మరోవైపు కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బుగ్గ వంక ప్రాజెక్టును పరిశీలించారు. రెండు జిల్లాలలో దాదాపు అన్ని ప్రాజెక్టులు నిండిపోయాయి. దీంతో నీటిని లోతట్టు ప్రాంతాలకు విడుదల చేశారు. ఆదినిమ్మయపల్లి పల్లె ఆనకట్టు వద్ద 11 క్యూసెక్కుల వరద ప్రవాహం రికార్డ్ అయింది. కుందు, పెన్నా, పాపాఘ్ని నదులు పరవళ్ళు తొక్కుతున్నాయి.గండికోట ప్రాజెక్టులు ఇచ్చి ఐదువేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు., మైలవరం ప్రాజెక్టులు ఇచ్చి 4200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. అలాగే బుగ్గ వంక, వెలుగల్లు, పింఛ ప్రాజెక్టులు నిండిపోవడంతో నీటిని విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు చెయ్యరు నది వరద ప్రవాహాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించారు. మందపల్లి గ్రామాన్ని పరిశీలించారు ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు జిల్లాలలో తుఫాన్ ప్రభావంతో ఎక్కడా భారీ వర్ష వర్షపాతం నమోదు కాలేదు. కడప జిల్లాలో అత్యధికంగా కాసినాయన మండలంలో 6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లాలో పెన గలూరులో 3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. అన్నమయ్య ప్రాజెక్టు వద్ద 5880 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉన్నట్లు ప్రాజెక్టు ఈ ఈ జయ చంద్రారెడ్డి తెలిపారు. అన్నమయ్యజిల్లాలో ఉద్యానవన పంటలను ఆ శాఖ జిల్లా అధికారి అధికారిని సుభాషిని పరిశీలించారు. పటలకు తెగులు పడకుండా అప్రమత్తగా ఉండాలని రైతులకు సూచించారు.


బుగ్గ వంక ప్రాజెక్టు నిండడంతో పరిశీలిస్తున్న కడప కలెక్టర్ శ్రీధర్


చెయ్యరు నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న జగన్మోహన్ రాజు


మైలవరం డ్యామ్ నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

## మఠాధిపతి నియామకం కొరకు వినతుల వెల్లువ..

దక్షిణాది రాష్ట్రాల నుండి భారీగా తరలి వచ్చిన భక్తులు

బ్రహ్మంగారి మఠం అక్టోబర్ 28 ప్రభాతవార్త





భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పో తులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 11వ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారు శివైక్యం పొందిన అనంతరం 12వ మఠాధిపతి నియామకం కొరకు కుటుంబ సభ్యులలో సఖ్యత లేక కోర్టును ఆశ్రయించగా గౌరవ హైకోర్టు ఉత్తర్వులు మేరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ రీజనల్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన కమిటీని నిర్ణయించి 12వ మఠాధిపతి నియామకం కొరకు సాంప్రదాయ బద్ధంగా చట్టాల అనుసరించి అదే మఠంకు సంబంధించిన ఆచారాలు కట్టుబాట్లతో పరిధిలోకి తీసుకొని స్వామీజీలు శిష్యుల అభిప్రాయాలు హిందూ సాంప్రదాయకు చెందిన భక్తుల అభిప్రాయాలను తెలుసుకుని నివేదిక వెల్లబుచ్చమని చెప్పిన నేపథ్యంలో మంగళవారం నాడు బ్రహ్మంగారిమఠం మఠం పరిధిలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుండి భారీగా స్వామి వారి భక్తులు తరలివచ్చి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు

### భారీ వర్షాన్ని లెక్కచేయని భక్తులు..

ధార్మిక పరిషత్ దేవాదాయశాఖ సంయుక్త నిర్వహణలో బ్రహ్మంగారిమఠం 12వ మఠాధిపతి నియామకం కొరకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించగా తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మఠంలో భారీ వర్షం కురిసిన స్వామి వారి మీద ఉన్న భక్తి భావనతో మఠానికి అదే సాంప్రదాయానికి చెందిన అదే కుటుంబానికి చెందిన వ్యక్తులు మఠాధిపతిగా ఉండాలని అభిప్రాయంతో తమ అభిప్రాయాన్ని వెల్లబుచ్చాలని వర్షాన్ని కూడా లెక్కచేయకుండా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిప్రాయాన్ని వెళ్లబుచ్చారు

**రీజనల్ జాయింట్ కమిషనర్ మాటల్లో..** గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ నిర్వహణలో బ్రహ్మంగారిమఠం మఠాధిపతి నియామకం కొరకు తనను నియమించడం జరిగిందని నేడు అదే సాంప్రదాయం చెందిన భక్తులు స్వామీజీలు శిష్యుల చేత అభిప్రాయ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఇక్కడ దాదాపు 3 వేల మందికి పైగా భక్తులు తమ అభిప్రాయాన్ని వెళ్ళబుచ్చారని భక్తులు వెల్లబుచ్చిన అభిప్రాయాలను తాము పరిగణలోకి తీసుకొని తొమ్మిది రోజుల లోపల ధార్మిక పరిషత్ కు నివేదికను పంపించడం జరుగుతుందని తదుపరి ధార్మిక పరిషత్తు బ్రహ్మంగారి మఠం 12వ మఠాధిపతి మీ నియమించే కార్యక్రమం తీసుకుంటుందని వారు తెలిపారు. మైదుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ మరియు పోలీస్ బారికెడ్లు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త తీసుకున్నారు.

## అప్రమత్తతతో సహాయక చర్యలపై దృష్టి సారించండి..!..

కడప, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టంపై.. అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. మొంథా తుఫాను వర్షాల పరిస్థితులను ఎదుర్కొనే సహాయక చర్యలు, సంసిద్ధతపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్, జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర సహాయక చర్యలపై తగు సూచనలు చేశారు. వరదనీరు పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని, వరద సహాయక చర్యల కోసం ప్రత్యేక రక్షణ సిబ్బంది, రెస్క్యూ టీము, ఫైర్ సిబ్బంది, బొట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జనరేటర్లు, మంచినీటి ప్యాకెట్లు, ఆహార ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బాలింతలు,గర్భిణీలను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచి ప్రత్యేక సంరక్షణ అందివ్వాలన్నారు. అధికారులందరూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు.

## మండలంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యటన

పెనగలూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త

మంథ తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల దృశ్యా మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం సాయంత్రం పెనగలూరు మండలంలో పర్యటించారు. వరదల వల్ల ప్రమాదకర పరిస్థితులు ఉన్న నర్సింగ్రాజపురం పంచాయతీలోని పల్లంపాడు గ్రామ పరిస్థితి పై ఆరా తీశారు. కోడి చిన్నయ్య గారి పల్లి సమీపంలోని పల్లంపాడు ఆర్చి దగ్గర చేయ్యరులో ప్రవహిస్తున్న వరదనీటి ప్రవాహం పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ పురం సర్పంచ్ వేలకు చర్ల సుజాత సురేష్, జడ్పిటిసి ఉదయగిరి పెద్ద సుబ్బరాయుడు పల్లంపాడు పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ఎస్పీకి క్షుణ్ణంగా వివరించారు ప్రతి ఏడు ఇలాంటి సాధారణ వర్షాలు వల్ల చేయుటలో ప్రవహించే నీటి వల్ల తమ గ్రామ ప్రజలకు ఏ ఇబ్బంది కలగదు అన్నారు. వర్షాల సీజన్లో గ్రామ ప్రజలు ప్రతి చిన్న అవసరానికి మండల కేంద్రానికి వెళ్లే ఆస్కారం ఉండదు కాబట్టి వారం రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు ముందుగానే సిద్ధంగా పెట్టుకుంటామన్నారు. సోమేశల ప్రాజెక్టు వెనుక జలాల ముంపు ప్రాంతంగా గుర్తించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం వినిపించి మరో చోటుకు తరలించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై దృష్టి సారిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన రామ్నాథ్ మనోజ్ హెగ్డే, పెనగలూరు తాసిల్దారు అమరేశ్వరి ఎస్సై బి రవి ప్రకాష్ రెడ్డి, ఆర్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై దాడులు

పులివెందుల అక్టోబర్ 28 , ప్రభాత వార్త :

పులివెందుల పట్టణ కేంద్రంలో మంగళవారం అర్బన్ సీఐ సీతారామిరెడ్డి ట్రైనీ ఎస్సై సుభహాన్‌లు సిబ్బందితో కలిసి కదిరి రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంక్ వెనుక భాగంలో పేకాట స్థావరం నుంచి నలుగురిని అదుపు లోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6433 నగదు స్వాధీనం చేసుకున్నామని, ఉలిమెళ్ల రోడ్డు నందు జరిపిన మరో పేకాట స్థావరాలపై జరిపిన దాడిలో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10600 స్వాధీనం చేసుకున్నట్టు రెండు దాడుల్లో 12 మంది పై కేసు నమోదు చేసినట్లు జామీను మీద విడుదల చేసినట్టు ట్రైనీ ఎస్సై సుభహాన్ తెలిపారు.

## చెట్టు తొలగించేందుకు చర్యలు చేపట్టిన రెవెన్యూ

**పీలేరు అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఓ చెట్టును తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక మదనపల్లి టర్నింగ్ లోని తపిసి చెట్టు తుఫాను కారణంగా కూలే ప్రమాదం ఉందని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన తహశీల్దారు శివకుమార్ పట్టణ వీఆర్వో ప్రసాద్ ను అక్కడి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. వీఆర్వో సిబ్బంది మదనపల్లి టర్నింగ్ లోని చెట్టు వద్దకు చేరుకుని సమస్యను గుర్తించారని, ఆ సమస్య పరిష్కారానికి తగిన మార్గాలు అన్వేషిస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని తహశీల్దారు తెలియజేశారు.



చెట్టును చూస్తున్న రెవెన్యూ సిబ్బంది

## మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో

### ముద్దాయికి జీవిత ఖైదు జైలు శిక్ష, జరిమానా

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 28, ప్రభాతవార్త:**

మైనర్ బాలికను హత్యాచారం చేసిన కేసులో మంగళవారం షేక్ సున్నంబట్టి జలాలుద్దీన్ అలియాస్ జలాల్(62)కు జీవిత ఖైదు, రూ.2500 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. 2018 అక్టోబరు 3వ తేదీ ముద్దాయి జలాల్ మైనర్ బాలికను మభ్యపెట్టి అత్యాచారం చేసి గర్భవతి అయి ఒక ఆడబిడ్డ పుట్టినందున మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ యాదవ్ కేసు నమోదు చేయగా డీఎస్పీ శ్రీనివాసరావు, సుధాకర్ విచారణ చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. స్పెషల్ అడిషనల్ పీపీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేయడంలో కృషి చేసిన ఇప్పటి డీఎస్పీ భావన ప్రస్తుత సీఐ తిమ్మారెడ్డి, కోర్టు మానిటరింగ్ ఏఎస్సై నాగేంద్ర, ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## విద్యా వ్యవస్థలో ఎన్నడు లేని విధంగా సంస్కరణలు

**పులివెందుల,అక్టోబర్ 28, ప్రభాత వార్త :**



2011 డీఎస్సీ ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులు కచ్చితంగా టెట్ లో ఉత్తీర్ణత సాధించాలి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దు అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరుపున రివ్యూ పిటిషన్ దాఖలు చేయనున్నారు అని శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రాంగో పాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ టెట్ విషయంలో ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగో పాల్ రెడ్డి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్ రామకృష్ణలు సచివాలయం లో కలిసి వినతిపత్రం అందించామని ఉపాధ్యాయులు టెట్ అర్హత విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించామన్నారు. టెట్ పరీక్షలో ఉపాధ్యాయుల న్యాయమైన అభ్యర్థనకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

## యల్లమరాజు చెరువును పరిశీలించిన సీఐ

**చిట్వేలి,అక్టోబర్ 28, ప్రభాతవార్త :**



మెంథా తుఫాను నేపథ్యంలో యల్లమ్మరాజు చెరువును స్థానిక సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. చెరువు కట్ట పటిష్టంగా ఉన్నదని, భయపడవలసిన పనిలేదని; అయినప్పటికీ సుమారు 80 శాతం మేర చెరువు నిండి ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువు నీటిని చూసేందుకు వచ్చే ప్రజలు సెల్ఫీ మోజులో చెరువులోకి దిగడం, అలుగులోకి వెళ్లడం లాంటి ఇబ్బందికర పనులను చేపట్టవద్దని తెలిపారు. రైతులు పొలాలు వద్ద తడిసిన కరెంటు స్తంభాలను,మోటార్లను ముట్టుకోవద్దన్నారు. చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎలాంటి ఇబ్బంది ఉన్న 9618873255 కంట్రోల్ నెంబర్ కు తెలియపరచాలని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నవీన్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న భూ కబ్జాల పరంపరం

**సుండుపల్లె, అక్టోబర్ 28, ప్రభాతవార్త :**

మండలంలో కూటమి ప్రభుత్వం మొదలైనప్పటి నుండి రోజురోజుకు భూఆక్రమణలు మితిమీరిపోతున్నాయి. మండల పరిధిలోని భైరవగుట్ట దగ్గర సుండుపల్లె గ్రామ సర్వేనెంబర్ 426 లో ఉన్న 3.59 సెంట్లు డీ పట్టా భూమిని దౌర్జన్యంగా మండలంలోని నాయకులు కబ్జాయత్నం చేస్తున్నారని బాధితుడు దేరంగుల సతీష్ వాపోయాడు. బాధితుడు కథనం మేరకు..తరాలుగా తమ ఆధీనంలో భైరవగుట్ట వద్ద సుండుపల్లి గ్రామ సర్వే నెంబర్ 426లో తమ తాత దేరంగుల కృష్ణయ్య పేరు మీద 3 ఎకరాల 59 సెంట్ల భూమి ఉందని, అది మా తాత గారి అన్నదమ్ములైన 5 మందికి సమాన వాటలో నేటికీ ఉందని కానీ సుండుపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఆక్రమణ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని బాధితుడు తెలిపాడు. మండల అధికారులకు ఫిర్యాదు చేసినా వారికి ఉన్న అధికార పలుకుబడి వినియోగించి తనను భయపెడుతున్నారని, తమ స్థలంలో చెట్లు నాటే ప్రయత్నం చేస్తున్నారని కూటమి ప్రభుత్వ రాష్ట్ర అగ్రనేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తమకు పిత్రార్జితంగా సంక్రమించిన భూమికి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. లేకపోతే తమకు ఆత్మహత్య మాత్రమే శరణ్యం అనిమాకు న్యాయం చేయాలని వాపోయారు.

## ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

**ప్రొద్దుటూరు రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



మొంథా తుఫాను రాత్రికి ఆంధ్రప్రదేశ్ లో తీరం దాటనున్న నేపథ్యంలో భారీ వర్షాలు సూచనలు ఉన్నాయని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గంగయ్య, రూరల్ ఎస్సై కె.సి. రాజు తెలిపారు. మంగళవారం వారు మండలంలోని బంక చిన్నాయపల్లె గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సూచనలు చేశారు. పుకార్లను నమ్మకూడదని, భయపడకుండా ప్రశాంతంగా ఉండాలని, అత్యవసర కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను ఛార్జింగ్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలు కోసం మెసేజ్‌లను గమనిస్తూ ఉండాలన్నారు. తుపాను సమయంలో అవసరమైన వస్తువులతో అత్యవసర వస్తు సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలి. ఒకవేళ ఇల్లు సురక్షితం కాదనుకుంటే, తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ప్రదేశాలకు చేరుకోవాలన్నారు. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ వైర్లు స్తంభాల కింద నిలబడకూడదని, పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాళ్లను విప్పి,వాటికి వదిలివేయాలని వివరించారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా తరగతులు

**పీలేరు అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలకు మంగళవారం ప్రభుత్వం సెలవు ప్రకటించినా పీలేరులో నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రయివేట్ పాఠశాలలు తరగతులు నిర్వహించడం ఏంటని ఎన్ఎస్యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతేజ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరులో కొన్ని ప్రయివేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నా ఎంఈవోలు పట్టించుకోకపోవడం ప్రభుత్వ ఆదేశాలు దిక్కరించడమేనని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

## నేడు కోటి సంతకాల సేకరణ రచ్చబండ

**పీలేరు అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

మెడికల్ కాలేజీల ప్రయివేటీకణను వ్యతిరేకిస్తూ మండలంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు యర్రగుంటపల్లె పంచాయతీ, కాకులారంపల్లె పంచాయతీ వేపులబైలు పంచాయతీలో కోటి సంకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి అన్నారు.

## వాగులు, వంకల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పీలేరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త;**



వాగులను పరిశీలిస్తున్న తహసిల్దార్ ఎంపీడీవో

మొంథా తుఫాన్ మండలంలో ఎక్కడ చూసినా వాగులు, వంకలు, చెరువులు, నదులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం. శివకుమార్, ఎంపీడీవో జి. శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పింఛా నది, గూడరేవుపల్లె వంక, తలపుల, ఎర్రగుంటపల్లె, బాలంవారిపల్లె, అగ్రహారం ప్రాంతల్లో చెరువు మొరవలు, వంకలు, వాగులు పరిశీలించారు. ప్రమాదం పొంచి వున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే తక్షణం సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు. తుఫాన్ పడిపోయిన వరిపంటను కాపాడుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ మురగన్, వీఆర్వోలు సిద్దయ్య ఇమ్రాన్, ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో రమాదేవి. హెచ్ సుకుమారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామూర్తి. సర్పంచ్ బి.సి. జయలక్ష్మి బి.సి. అమరనాథరెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

**కలికిరి, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



మండలంలోని 14 పంచాయతీల్లో మొంథా తుఫాను పట్ల ప్రజలను ఎంపీడీవో భానుమూర్తిరావు, మండల తహసీల్దార్ హరికుమార్, మండల డిప్యూటీ ఎంపీడీవో మహమ్మద్ రియాజుద్దీన్‌లు ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీలలో పర్యటిస్తూ చెరువులను పరిశీలించారు. చెరువులలో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రమాదం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామ పంచాయతీలో ఉన్న బయపురెడ్డిపల్లె చెరువు మరమ్మతులకు గురై ప్రమాదం సంభవిస్తుందని సమాచారం అందడంతో ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దార్ హరికుమార్, ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, డీఈ గోపీకృష్ణ, ఏఈ శ్రీనివాసులురెడ్డి, వీఆర్వోలు చెరువులను పరిశీలించి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. అదే విధంగా కలికిరి పెద్ద చెరువును అధికారులు పరిశీలించారు. మహల్–పాపిరెడ్డిగారిపల్లె రోడ్డు మార్గంలో ఉన్న బ్రిడ్జిని తహసీల్దారు పరిశీలించారు. రాకపోకలతో వంతెన కూలే ప్రమాదం ఉండడంతో రాకపోకలు జరగకుండా ఆయన చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు మండల ప్రజలను అప్రమత్తం చేయడంతో మండలంలో ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహమ్మద్ రియాజుద్దీన్, వీఆర్వోలు ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులను పూర్తి చేయండి

**వేంపల్లె:అక్టోబర్:28:(ప్రభాత వార్త)**



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికీ సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ ని కోరారు. మంగళవారం విజయవాడలో ప్రిన్సిపాల్ సెక్రటరీని ఎమ్మెల్సీ కలిశారు. వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికీ తగిన నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. దీంతో ప్రిన్సిపాల్ సెక్రటరీ స్పందించారు. వీటి కోసం గతంలో నాబార్డు కింద నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ పథకం పూర్తైందని, నిధుల సమస్య ఏర్పడిందన్నారు. ఇతర కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిధులు సమకూర్చి ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు జీవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వేంపల్లె:అక్టోబర్:28:(ప్రభాత వార్త)**



మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు హెచ్చరించారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి వాగులు, వంకలు, పాపాఘ్ని నది ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం నదిలోకి వెళ్లకుండా ఎర్ర జెండాలు, సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే అయ్యప్ప స్వామి మాలాధారణ చేసిన వారికి పలు జాగ్రత్తలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వెలిగల్లు జలాశయం నుంచి పెద్ద ఎత్తున నీటిని దిగువకు విడుదల చేశారన్నారు. పాపాఘ్ని నది తీర ప్రాంతంలో ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండడమే సురక్షితమని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికతో పాటు ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎద్దైనా అత్యవసర సహాయం కోసం పోలిసులకు సమాచారం అందించాలని, ప్రజల రక్షణ, బధ్రతకు పోలీస్ వ్యవస్థ ఎల్లవేళలా ముందుంటుందని విజ్ఞప్తి చేశారు.

### రాజంపేట జిల్లా కేంద్రం కోసం

# ఏ త్యాగానికైనా సిద్ధం

**రాజంపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



పార్లమెంట్ నియోజకవర్గ ,రెవిన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర పురపాలక కమిటీ కార్యదర్శి, రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్మర్రి రవికుమార్ డిమాండ్ చేశారు. అందుకు ఎంతటి త్యాగానికి అయినా సిద్ధమని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా పోరాడేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైసిపి హయాంలోనే కొత్త జిల్లాలు ఏర్పడినా నాడు రాజంపేటకు అన్యాయం జరగడంతో ఆనాడు కూడా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం జరిగిందని గుర్తు చేశారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి రాజంపేట జిల్లా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన కూడా పంపడం జరిగిందనీ పేర్కొన్నారు. అయితే నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎవరు మాట విన్నారో తెలియదు కానీ రాయచోటి జిల్లా చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లు రాజంపేట సభలో రాజంపేట జిల్లా కేంద్రం చేస్తారని ప్రకటించారని గుర్తు చేశారు. అయితే తాజా పరిస్థితిలను గమనిస్తే రాజంపేట జిల్లా కేంద్రం చేసే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. అందుకే ప్రజలు అన్నీ మౌలిక సదుపాయాలు ఉన్న రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని ప్రజలు పోరాడేందుకు సిద్ధంగా పరిస్థితిని గుర్తు చేశారు.లేదంటే మరోసారి రాజంపేట పూర్తిగా అభివృద్ధి దేశంలో వెనుక పడుతుందని ఆవేద వ్యక్తం చేశారు. 1907లోనే రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంగా ఏర్పాటయిందని పేర్కొన్నారు.

## తుఫాన్ సహాయక చర్యల్లో భాగస్వాములు కండి

**తంబళ్లపల్లె అక్టోబర్ 27 ప్రభాతవార్త ః**



మండలంలోని పోలీసులతో పాటు అన్ని శాఖల అధికారులు మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో ముమ్మరంగా పాల్గొని సహకరించాలని తహశీల్దార్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని పలు ప్రాంతాలలో సుడిగాలి పర్యటనలో భాగంగా వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నీటి జలాశయాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత రెవిన్యూ, సచివాలయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మారుమూల ప్రాంతాలలో అంటూ వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యంతో పాటు ఆరోగ్య సూత్రాలు బోధించాలన్నారు. తుఫాను ప్రభావంతో ఎక్కడైనా పంటల నష్టం ఏర్పడితే ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం నష్టపరిహారం పై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తుఫాన్ సహాయక చర్యలు చేపట్టడంలో అధికారి యంత్రాంగం చొరవ చూపాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, వీఆర్వో నాగరాజు, రెవిన్యూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో విజేతగా పీలేరు విద్యార్థి

**పీలేరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త;**

సూరత్లో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్షిప్ పోటీలో పీలేరు విద్యార్థి ఎస్. ఫరాజ్ విజేతగా నిలిచిచాడు. స్థానిక శ్రీ కాకతీయ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎస్. ఫరాజ్ విశేష ప్రతిభ చూపి నేషనల్ కరాటే చాంపియన్షిప్ విజేతగా నిలిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డి.వి. రమణారెడ్డి అన్నారు. ఈ అద్భుతమైన విజయం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

## వర్షాలపై అధికారుల పర్యవేక్షణ

**దువ్వూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త:**



మంగళవారం ఉదయం నుండి మొంథా తుఫాను వల్ల కురుస్తున్న వర్షాలపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు. మండల స్థాయి అధికారులు అందరూ ఒక్కొక్క గ్రామ సచివాలయానికి పర్యవేక్షణ అధికారిగా నియమించారు. దీంతో అధికారులు ఆయా సచివాలయాల పరిధిలోకి వెళ్లి వర్షాలపైన పరిస్థితిని సమీక్షించారు. ఎవరైనా మట్టి మిద్దెల్లో నివాసం ఉంటే వారిని ఖాళీ చేయించి పాఠశాల, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టారు. నారాయణ పల్లె, బయనపల్లి గ్రామాల్లో మట్టి మిద్దెల్లో ఉన్నవారిని అక్కడి నుంచి వేరే చోటికి తరలించారు. అలాగే నీలాపురం సుగాలి తండా వంకా యొక్క పరిస్థితిని గమనించారు. నీరు ఎక్కువైతే గ్రామంలోకి రావద్దని సూచించారు. ఉదయం నుండి వర్షం మొదలై సాయంత్రం వరకు పడుతూనే ఉంది. మంగళవారం మధ్యాహ్నానికి 32 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఎక్కడ చూసినా వర్షాలతో వంకలు, వాగులు ప్రవహిస్తున్నాయి. కుందూ నదిలో నీటి ప్రవాహం సుమారు 10వేల క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కుందూ నదిలో నీటి ప్రవాహం పెరగాలంటే నంద్యాల తదితర ప్రాంతాల్లో వర్షాలు పడితే పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. శ్రీశైలం నుండి నీరు నిలిపివేయడంతో కుందులో ప్రవాహం పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ వర్షాలతో పంటలకు పెద్దగా నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హిధాయతుల్లా, తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పెండ్లిమర్రి, అక్టోబరు 28, ప్రభాతవార్త:**

మొంథా తుఫాను ప్రభావం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చల్లని దొర, ఎస్సై మోహన్‌కుమార్ గౌడ్‌లు మండలంలోని ప్రజలకు సూచించారు. మంగళవారం వారు వంకలు, చెరువులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తుఫాను వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు వచ్చిన వెంటనే సమాచారం తెలపాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎవరైనా ప్రజలు ఇబ్బంది పడితే ఆ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోకి నీరు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా సమైక్యనగర్ ప్రజలు చెన్నంరాజుపల్లి హరిజనవాడ గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ప్రజలను అప్రమత్తం చేసిన పోలీసులు

**కడప, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



మొంథా తుఫాను పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు క్షేత్రస్థాయిలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఆదేశాల మేరకు డ్యాముల వద్ద ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పరిశీలిస్తూ నదులు, వాగుల పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి మండల, గ్రామ స్థాయిలో పోలీసులు, రెవెన్యూ, ఫైర్ మరియు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే టోల్ ఫ్రీ నంబరు 112కు సంప్రదించి సహాయం పొందాల్సిందిగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**కడప, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఏఆర్ అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎందరో అభాగ్యులు ఆపత్కాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రాణదానం చేసేందుకు రక్తదానం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్సై వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ టెక్నీషియన్ స్వరూప రాణి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో దసరా పూజలు

**తంబళ్లపల్లె అక్టోబర్ 27 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం దసరా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పట్నాయక్, ఏవో థామస్ రాజా, ఎంఈఓ త్యాగరాజు, డిప్యూటీ ఎండిఓ ఈశ్వర్ రెడ్డి, ఏపిఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణనాయక్, టైపిస్ట్ సురేంద్ర, జూనియర్ అసిస్టెంట్ విజయ్,కార్యదర్శిలు, ఖయ్యూం, నాగేంద్ర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలు ఏర్పాటు

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

మెంథా తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన అలజడి రేకెత్తింది. ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో సహా ఎస్పీలు, కలెక్టర్లు, ఎమ్మార్వోలు, సిఐలు, ఎస్సైలు మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అంతా కూడా నేడు అప్రమత్తతో ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తుంది. అన్ని ప్రాంతాలలో కూడా ప్రతి మండలంలోనూ ఒక టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పరిస్థితులలో బద్వేల్ నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు అయినటువంటి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్ రెడ్డిలు తమ యొక్క సొంత కళ్యాణ మండపంలోని 100 రూములను తుఫాను బాధితులకు పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేయడం చాలా హర్షించదగ్గ విషయమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిషఉట్టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పునరావస కేంద్రంలో ఉన్నటువంటి ప్రజలకు ఎస్పివిఆర్ ట్రస్ట్ నుండి నిత్యవసర వస్తువులు ఆహార పదార్థాలు అందిస్తామని చెప్పడం కూడా జజరిగిందన్నారు. ప్రస్తుతం వీరు చేస్తున్నటువంటి ఈ సహాయం తుఫాను బాధితులకు ఆపన్న హస్తం లాంటిదని, ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు కూడా అప్రమత్తంగా ఉండి బాధితులను గుర్తించి రాజకీయాలకు అతీతంగా విజయమ్మ కుటుంబం చేస్తున్నటువంటి ఈ సహాయాన్ని బాధితులకు అందించవలసిందిగా కోరుతున్నామన్నారు.

## యనమల సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

మొంథా తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో బద్వేల్ నియోజకవర్గం లోని రైతు సోదరులు, పశుకాపరులు , ఇతర పనులకు వెళ్లే ప్రజలు ఈ మూడు రోజులు అనగా 27,28,29 తేదీలలో ఆంధ్ర రాష్ట్రానికి ఈదురు గాలులతో కూడిన తీవ్ర తుఫాను ఉన్నందువల్లన అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలెవరు బయటకి రాకుండా రాబోయే ఉపద్రవం పట్ల అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. చిన్నపిల్లలు పెద్దలు కరెంటు స్తంభాలు తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్కూళ్లకు , కాలేజీలకు సెలవులు ప్రకటించి ముందు జాగ్రత్త నివారణ చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందన్నారు.

## నష్టపోయిన ప్రతి బాధితులకు పక్కా ఇళ్లు నిర్మిస్తాం

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్28 ప్రభాతవార్త:**



కాశి నాయన మండలం సావిశెట్టి పల్లె గ్రామంలో భారీ వర్షం కారణంగా ఎస్సీ కాలనీలో 30 కుటుంబాలకు చెందిన మట్టి మిద్దెలు,బోధ కొట్టాలు వర్షానికి ఇబ్బందులు పడడంతో విషయం తెలుసుకున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వారిని పునావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సాయంత్రం ఆమె సామిశెట్టిపల్లి గ్రామానికి చేరుకొని స్వయంగా బాధితులతో మాట్లాడి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ కు ఫోన్ ద్వారా సమస్యను వివరించి వర్షం తగ్గిన వెంటనే బాధితులకు పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. అనంతరం బాధితులకు దుప్పట్లు, బిస్కెట్లు,వాటర్ బాటిల్లు అందజేశారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని తాము అన్ని విధాల అండగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఆమె దృష్టికి వచ్చిన పలు సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వివరించి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటసుబ్బయ్య, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ బంగారు గురువిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి,సర్పంచ్ సగిలి వరప్రసాద్, శ్రీనివాసరెడ్డి,పంగా రవీంద్రారెడ్డి, రోహిత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, చెన్నారెడ్డి, చిన్న రమణారెడ్డి గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ జనరల్ సెక్రటరీగా జయరామిరెడ్డి

**రామసముద్రం,అక్టోబర్ 28ప్రభాతవార్త**



మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతం కొరకు అహర్నిశలు పనిచేస్తున్న మండల సీనియర్ వైసీపీ నాయకులు జయరామిరెడ్డికి వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా పదవి వరించాయి. ఈ నేపథ్యంలో మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున జయరామి రెడ్డి కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జయరామి మాట్లాడుతూ ఈ పదవి బాధ్యతలకు సహకరించిన మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి,మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిషార్ అహ్మద్,మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి,మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు, వైసీపీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపుతూ పార్టీ ఆదేశాల మేరకు సమస్యలు కొరకు కృషి చేస్తామని వైసీపీ పార్టీ కోసం సైనికునిగా పనిచేస్తాన్నారు.

## మైలవరం ప్రాజెక్టు పరిశీలన

**జమ్మలమడుగు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

మైలవరం ప్రాజెక్టు ను పరిశీలించిన జల శక్తి అభియాన్ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో సైంటిస్టులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివప్రసాద్, పి ఆర్ రావు పర్యటించారు. ప్రాజెక్టుల అధ్యయనం, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసేందుకు వారు వచ్చారు. డామ్ బ్రేక్ అనాలసిస్ పై వారు అధ్యయనం చేశారు. స్థానిక భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మైలవరం డ్యామ్ కూడా వారు పరిశీలించారు. డ్యాం వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. శాస్త్రవేత్తల వెంట జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ, మైలవరం ప్రాజెక్టు ఈఈ రమేష్, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల ఏర్పాటు

**బద్వేలు, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



రాష్ట్రానికి మెంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బద్వేల్ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంత ప్రజలకోసం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ , మరియు టీడీపీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి అధికారులతో కలిసి బద్వేల్ లోని ఎస్ బి వి ఆర్ కళాశాలలోని 100 రూములను అలాగే ఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్ ను లోతట్టు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పునరావాసంలో ఉన్న ప్రజల కోసం ఎస్పివిఆర్ ట్రస్ట్ నుండి అన్ని నిత్యవసర వస్తువులు ఆహారం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేయడం జరిగిందనారు.

## వైసీపీ నాయకులకు ఘన సన్మానం

**రామసముద్రం అక్టోబర్ 28 ప్రభాతవార్త**

మండలానికి చెందిన వైసీపీ నాయకులకు మండల కేంద్రంలో మంగళవారం నరసాపురం గ్రామానికి చెందిన అన్నమయ్య జిల్లా బిసి జనరల్ సెక్రటరీ చిన్నగార్ల తిమ్మయ్య, వైసీపీ సీనియర్ నాయకులు బాస్కర్ గౌడ్ తనయుడు జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీ మెంబెర్ దర్శన్ గౌడ్ ఎంపిటీసీ,జిల్లా వైసీపీ పంచాయతీ రాజ్ వింగ్ సెక్రటరీ మస్తాన్ లకు ఘనంగా మండలం వైసీపీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు శాలువలు కప్పి ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు.వైసీపీ పార్టీలో పదవులు పొందిన వారు మాట్లాడుతూ మాకు పదవులు ఇచ్చిన మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సి నరేష్ కుమార్ రెడ్డి మండల వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మొంథా తుఫాను ప్రభావాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త



మొంథా తుఫాను నేపథ్యం లో మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి అధికారులను వెంటబెట్టుకుని ఆయా ప్రాంతాలలో పర్యటించి నిలిచిపోయిన వర్షపు నీరు వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టారు. తుఫాను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే వరద మైదుకూరు రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంక్ స్నేహము వద్ద రోడ్లమీద నిలిచి ఉన్న వర్షపు నీరును కాలువలలోకి పోయేలా చర్యలు చేపట్టారు. అలాగే మైలవరం డ్యాం నుండి నీటి విడుదలతో ఎన్నో పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సాయిశ్రీ మాజీ జెడ్పిటిసి సభ్యులు తోట మహేశ్వర్ రెడ్డి ప్రొద్దుటూరు స్పెషల్ ఆఫీసర్ డిసిఓ వెంకటసుబ్బయ్య కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ కొమిరెడ్డి శివచంద్రారెడ్డి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య తాసిల్దారు గంగయ్య ఆర్ అండ్ బి ఇఈ రామాంజనేయులు డి ఈ నరసింహులు ఏఈ వెంకటరమణ కొత్తపల్లి వార్డు సభ్యులు కోటిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మరియు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయంలో ఆధార్ కేంద్రం

మదనపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కురవంక గ్రామ ప్రజల సౌలభ్యం కోసం, గ్రామంలో ఆధార్ కేంద్రం లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, గ్రామ సర్పంచ్ పసుపులేటి చలపతి నూతన ఆధార్ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆధార్ కేంద్రం లేక, ఆధార్ సేవలు (కొత్త ఆధార్, అప్‌డేట్స్) కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుండడంతో, ముఖ్యంగా వృద్ధులు, కూలీలు ఎంతో సమయాన్ని, డబ్బును వృధా చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఇక నుంచి, అన్ని ఆధార్ సేవలు ఇక్కడే అందుబాటులో ఉంటాయి. ఈ కేంద్రాన్ని మన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే మా ప్రధాన లక్ష్యం."ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుతో కురవంక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## క్యాన్సర్ పరీక్షలు చేసుకోండి

రామసముద్రం అక్టోబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో డాక్టర్ జాహ్నవి, డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సిహెచ్ఓ ఉమాదేవి, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి పలువురికి పరీక్షలు చేశారు.డాక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నుండి 70,80 కలిగిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ తెలిపారు. రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు ప్రత్యేక మహిళకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి దశలో ఉన్న క్యాన్సర్ లక్షణాలను అరకట్టి ప్రాణాలను రక్షించు కోవచ్చుఅని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేసుకుని ప్రాణాలను కాపాడుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఉమాదేవి, ఏఎన్ఎం గీతారాణి ఆశావర్కర్స్ భానుప్రియ, లక్ష్మీదేవి, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా బలోపేతమే లక్ష్యం : నిషార్ అహ్మద్

మదనపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త



సన్మానిస్తున్న దృశ్యం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని నియోజకవర్గ ఇంచార్జ్ నిషార్ అహ్మద్ తెలిపారు. మంగళవారం వైకాపా కార్యాలయంలో ఇటీవల పార్టీ పదవుల పొందిన వారికి ఘనంగా ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందినవారు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. కార్యకర్తలే పార్టీకి ప్రధాన పట్టుకొమ్మలున్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రతి ఉద్యమంలోనూ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొనాలన్నారు.

## చెరువులు, కుంటలు, నదులు పరిశీలన

పీలేరు , అక్టోబర్ 28 ప్రభాతవార్త



పింఛానది పరిశీలిస్తున్న రాయిచోటి ఆర్డీవో

వర్షాల కారణంగా నిండిన అగ్రహారం, అయ్యవారిచెరువు, చితల చెరువులను, పొంగుతున్న పింఛానది నీటి ప్రవాహాన్ని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటా విపత్తులపైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. పీలేరు మండల పరిధిలో సాగులో ఉన్న పంట పొలాలు వరి, ఇతర పంటలకు జరిగిన నష్టాన్ని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ మంగళవారం పరిశీలించారు. మండల తహసీల్దార్ శివకుమార్, అధికారులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ

మదనపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మాజీ మార్కెట్‌కమిటీ వైస్‌ఛైర్మెన్ మూరే విజయకుమార్‌రెడ్డి, సతీమణి అరుణల ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమ్మనపల్లెలోని బిసిహాస్టల్, స్కూల్స్‌కు ఎనలేని కృషిచేశారన్నారు. అనంతరం వెంగలవారి కురవపల్లెలోని గంగమ్మగుడికి రూ.10,116లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు, రమణ సోమశేఖర్‌రెడ్డి, వెంకటరమణలు పాల్గొన్నారు.

## మాండవ్య నది ప్రవాహ పరిశీలన

చిన్నమండెం అక్టోబర్ 28 ప్రభాత వార్త:



మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్ బాబు మంగళ వారం మొంథా తుఫాను కారణంగా మండలంలోని అన్ని వాగులు, వంకలు మరియు మాండవ్య నదిని సందర్శించడం జరిగినది. ఇందులో భాగంగా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులకు మరియు సచివాలయ సిబ్బందికి సూచించడం జరిగినది. అంతేకాక అన్ని సచివాలయాలు సందర్శించడం జరిగినది.

## చేతికి అందాల్సిన వరి పంట నీటి పాలయ్యే

సిద్ధవటం అక్టోబర్ 28 ప్రభాతవార్త



మరికొన్ని రోజుల్లో చేతికి అందాల్సిన వరి పంటలు నీటిపాలయిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో భారీ వర్షం కారణంగా సాగుచేసిన వరి పంటలు పూర్తిగా దెబ్బతింది. సిద్ధవటం మండలంలోని లింగంపల్లి, మంగనవాండ్ల పల్లె, కడపాయపల్లె గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి పంట వర్షం కారణంగా పొలాలలో నీరు వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఈ సందర్భంగా మంగళవారం బాధిత రైతులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదుల గాలుల వల్ల వరి పంట పూర్తిగా నీటి పాలై పోయిందన్నారు. జూన్ మాసంలో సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాల వల్ల దాదాపు 200 ఎకరాల పైబడి వరి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. వర్షం కారణంగా సాగు చేసిన వరి పంటకు మొలకలు వచ్చాయన్నారు. భూములు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేసేందుకు అప్పులు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సగిలేరు నదిపరివాహక ప్రాంత పరిశీలన

బద్వేలు, అక్టోబర్ 28, ప్రభాతవార్త



తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పుటాయిపల్లె గొడు గునూరు అబ్బు సాహెబ్ పేట సైక్లోన్ రిలీఫ్ విలేజ్ గ్రామాలను ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ జి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ తీవ్రంగా ఉన్నందువలన వైద్య శిబి రము ఏర్పాటు చేసి 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండి తీవ్రమైన వర్షాల వలన నీరు కలుషితము, వాంతులు విరోచనాలు టైఫాయిడ్ జ్వరాలు వచ్చే దానికి అవకాశం ఉన్నందువల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె వినయ్ కుమార్ డాక్టర్ సౌమ్య హెల్త్ అసిస్టెంట్ వి జనార్దన్ రావు శ్రీరాములయ్య మరియు ఏఎన్ఎంస్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నష్టపోయిన ఉల్లి రైతుల తోటల పరిశీలన

తొండూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త :



మండలంలోని గ్రామాలలో ఇటీవల కురిశిన వర్షాలకి తొండూరు మండలంలోని ఉద్యాన మరియు వ్యవసాయ పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు మరియు ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్ రెడ్డి తొండూరు మండలంలోని తొండూరు, భద్రంపల్లి బూచుపల్లి, ఇనగనూరు గ్రామాలను సందర్శించడం జరిగినది నష్టపోయిన రైతులు వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని రైతులకు తెలిపారు ముఖ్యంగా ఉల్లి పంటలో తక్కువ మోతాదులో నష్టం ఉంటే భావిస్టిన్ ఒక లీటర్ నీటికి ఒక గ్రాము పిచికారీ చేసుకోమని ఉద్యాన శాఖ అధికారి సూచించారు తద్వారా ఉల్లి యొక్క కుళ్ళును కొద్ది శాతం నివారించవచ్చని రైతులకు సూచించారు. రైతులతో కలిసి తోటల వద్ద ఉన్న వర్షానికి తడిసి పాడైపోయిన ఉల్లి పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు.

## సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు అర్బన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త



బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన యూనియన్ ఏడవ మహాసభలలో కార్మిక వర్గ స్థితిగతులను చర్చించి రాబోవు కాలంలో కార్మిక హక్కుల సాధనకై మహాసభకు హాజరైన కార్మికులందరూ యూనియన్ నూతన కమిటీని 15 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు .అందులో గౌరవ అధ్యక్షులుగా కోగిలంపాటి శ్రీనివాసులు, అధ్యక్షులుగా నాగరపు సత్యరాజు, ప్రధాన కార్యదర్శిగా కాలువ నాగేంద్రబాబు, కోశాధికారిగా కాలువ శివకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దియ్యాల హరి, ఉపాధ్యక్షులుగా దియ్యాల దేవమ్మ, నేలటూరి పాలయ్య, కార్యదర్శులుగా గంటా శ్రీనివాసులు, బద్వేలు ప్రవీణ్ కుమార్,పులి శ్యాం ప్రవీణ్ కమిటీ సభ్యులుగా తేళ్ళ కిరణ్, దియ్యాల నాగేంద్రబాబు, పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్, గడ్డం క్రిష్ణయ్య, గురు వరప్రసాద్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో మమ్ములను ఎంపిక చేసిన సిఐటియు నాయకులకు కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మొంథా తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త:



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి ఇది మొంథా తుఫానుగా మారినట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు పడుతుందన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మరో 2, 3 రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. మొంథా విస్తృతంగా వ ర్షాలు పడుతున్నందున మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో పంట కాలువలు, అలుగు వంకలు, కడ్డీల వంక, బద్వేల్ రోడ్డులో వర్షపు నీరు వెళ్లే కాలువలు విస్తారంగా పడుతున్న వర్షానికి నంద్యాల రోడ్డు అనుకుంట, శీలంనగర్, పొట్టి శ్రీరాములు సర్కిల్, శ్రీకృష్ణదేవరాయులు సర్కిల్ నుండి బస్టాండ్ వరకు అధిక వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. బద్వేల్ రోడ్డు పొట్టి శ్రీరాములు సర్కిల్ నందు అలుగు వంక నీరు అధిక వర్షాల హెచ్చరికలతో సోమవారం మున్సిపాలిటీ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్ రెడ్డి, పరిశీలించి ఆక్రమణలను అవసరమైతే తొలగించడానికి ప్రక్షాళన చేపడతామని తెలియజేశారు. మొంథా తుఫాను ప్రభావం కారణంగా డిడి సోషల్ వెల్ఫేర్ అధికారులు, మైదుకూరు మండలం తహశీల్దార్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పొలిమేర రాజగోపాల్ రెడ్డి మరియు సచివాలయ సిబ్బంది శెట్టి వారిపల్లె చెరువు మరియు గ్రామంలోని వీధులు పర్యటించి గోడలు బాగా నాని కూలిపోయే అవకాశం ఉన్న ఇళ్లను గుర్తించి,ఇళ్లలో నివాసం ఉండే ప్రజలకు తుఫాను ప్రభావంపైన అవగాహన కలిగించి వారికి స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ నందు షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగినది.

## దాతృత్వం చాటుకొన్న కాపురస్తులు

సుండుపల్లె, అక్టోబర్ 28, ప్రభాతవార్త :



మండలపరిధిలోని దీన్నేమీద బలిజ పల్లె కు చెందిన బోనంశెట్టి నాగరాజ కుమారుడు నాగచైతన్య (14) బోన్ బ్లడ్ క్యాన్సర్ తో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పెద్ద బలిజ పల్లె గ్రామస్తులు దాతృత్వంతో 2,00,026/ రూపాయల నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల నాగరాజు, రెడ్డిచర్ల వెంకటేష్, అన్నదానం రవి, రామాంజులు, మధన, సుబ్బరాము తదితరులు పాల్గొన్నారు.

## కుశావతీ నదిని పరిశీలించిన డిపిఓ

పెద్దమండెం అక్టోబర్ 28 ప్రభాతవార్త



మండలంలో ప్రవహిస్తున్న విషావతి నది తీరాన్ని డిపిఓ రాధమ్మ మంగళవారం పరిశీలించారు ఈ నది ప్రవాహంతో ప్రజలకు రాకపోకలకు ఎవరు అంతరాయం కలుగుతుందని ఎంపీడీవో శ్రీధర్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ నది ప్రవాహం ప్రతి చిన్న వర్షానికి పొంగిపొర్లతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తుందని దీన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని తెలిపారు గతంలో ఈ ప్రవాహంతో చాలా వాహనాలు కొట్టుకుపోయి ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు దీనిపై ఉన్నత అధికారులకు తవంతు కృషి చేసే బ్రిడ్జి ఏర్పాటును పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారిన బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు ఇకనైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారని ఆమెకు తెలియజేశారు

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

పులివెందుల,అక్టోబర్ 28, ప్రభాత వార్త :



పులివెందుల మున్సిపల్ పరిధిలోని ప్రశాంత్ నగర్ ఇందిర వాటర్ ప్లాంట్ రెండవ వీధిలో ఉండే రోడ్డు మరియు డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పులివెందుల బీజేపీ మండల అధ్యక్షులు వై. నవీన్ మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందించి కోరారు. మంగళ వారం మున్సిపల్ కార్యాలయంలో ప్రశాంతి నగర్ ఇంద్ర వాటర్ ప్లాంట్ రెండో వీధి నివాసులు తో కలిసి మా ప్రాంతంలో గత రెండేళ్లుగా రోడ్డు మరియు డ్రైనేజీ సదుపాయాలు లేవనీ ఈ సమస్య గురించి మున్సిపల్ అధికారులకు ఎన్నో అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదనీ వర్షాకాలం సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందనీ వాన పడినప్పుడు మేము ఇళ్ల నుండి బయటికి రావడం సాధ్యంకావడం లేదు అని స్థానికులు కమిషనర్ ముందు వాపోయారు. డ్రైనేజీ లేకపోవడం వల్ల చెత్త నీరు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది, విషపూరిత కీటకాలు మరియు ఎలుకలు పెరుగుతున్నాయనీ ఎలుకలు పైపులు పాడుచేయడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ వారి ఆవేదన వ్యక్తం చేశారు.కావున మా ప్రాంతంలో తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, రోడ్డు పనులు పూర్తి చేయించవలసిందిగా మున్సిపల్ కమిషనర్‌కు కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

## భారీ వర్షాలకు పోలీసు బృందం హైఅలర్ట్

పెనగలూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త



మొంతా తుఫాను కారణంగా మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలంటూ పెనగలూరు ఎస్సై బి రవి ప్రకాష్ రెడ్డి బృందం హై అలర్ట్ గా ఉంటూప్రజలను అనుక్షణం అప్రమత్తం చేస్తున్నారు. పగలు రాత్రి కురుస్తున్న జోరు వానను లెక్కచేయకుండా పోలీస్ బృందాలను నలువైపులా పంపిస్తూ తన వెంట ఓ బృందాన్ని ఉంచుకొని నదులు చెరువులు కాలువలు వంకల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రవహిస్తున్న వరద నీటిని చూసేందుకు వస్తున్న జనాన్ని అప్రమత్తం చేస్తూ నేటి సమీపానికి రావద్దని హెచ్చరికలు చేస్తున్నారు ప్రధానంగా సింగనమల ఈటిమాపురం మధ్యలో గుంజనీరుపై ఉన్న హై లెవెల్ బ్రిడ్జి వద్ద వరద నీటిని చూసేందుకు వస్తున్న ప్రజలను అక్కడికి రాకుండా నచ్చజెప్పి వెనుకకు పంపిస్తున్నారు.

## టీడీపీలో చేరిన 40 వైసీపీ కుటుంబాలు

పులివెందుల,అక్టోబర్ 28, ప్రభాత వార్త :



నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కంచుకోట ఆయన లింగాల మండలంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. లింగాల మండలంలోని అంకేవానిపల్లి గ్రామానికి చెందిన సుమారు 40 వైస్సార్సీపీ కుటుంబాలు మంగళవారం నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి.లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ యమ్మనూరు విశ్వనాథ రెడ్డి ,లింగాల మండల టీడీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి ల ఆధ్వర్యంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి వారిని కండువాలు కప్పి టీడీపీలో ఆహ్వానించారు జరిగింది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి చూసే పార్టీ లోకి చేరుతున్నా మని పార్టీ బలోపేతం కోసం వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ,తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంతకాల సేకరణ

తొండూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త :



మండలంలోని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు మల్లెల గ్రామంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు ఆపాలని మంగళవారం వర్షాన్ని సహితం లెక్క చేయకుండా ప్రతి ఇంటికి తిరిగి కోటి సంతకాల సేకరణ ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా వైకాపా మండల ఇన్చార్జి భూమిరెడ్డి రవీంద్రారెడ్డి మరియు మరియు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు డివి. శశికాంత్ రెడ్డి హాజరయ్యారు. వారు ముఖ్యంగా మెడికల్ కళాశాలను ప్రైవేటు చేయడానికి వ్యతిరేకంగా ఈ సంతకాల సేకరణ చేపట్టమన్నారు. అనంతరం ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాలుకా ప్రధాన కార్యదర్శి యాడికి ధశరథ రామిరెడ్డి రజీనీకాంత్ రెడ్డి దాసరి శశికాంత్ రెడ్డి అంకిరెడ్డి సురేష్ రెడ్డి(చంటి)వెంటరామి రెడ్డి అగదూరు ఎంపీటీసీ కొప్పల శివశంకర్ రెడ్డి సగబాల లక్ష్మీ రెడ్డి యాడికి బాబు చల్లా రమేష్ కుదుముల మధుసూదన్ రెడ్డి బంగారు మునెయ్య జింకా అశ్వని కుమార్ మార్తల గురుమోహన్ రెడ్డి దస్తగిరి ఇసుకపల్లి రంగారెడ్డి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బాల ఆధార్‌ను సద్వినియం చేసుకోండి.

తంబళ్లపల్లె అక్టోబర్ 28 ప్రభాతవార్త ః



మండలంలోని పదవ తరగతి విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు బాల ఆధార్ కేంద్రం ద్వారా ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీవో పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు లు తెలియజేశారు. మంగళవారం మండలంలోని గోపి దిన్నె బాల ఆధార్ కేంద్రాన్ని సచివాలయంలో ఏర్పాటు పై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపి దిన్నె తో పాటు తంబళ్లపల్లె, కన్నెమడుగు హైస్కూలలో ఈ బాల ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని విద్యార్థులు తమ అవసరాల నివృత్తి కోసం ఈ కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

## విజిలెన్స్ విచారణ నివేదికను బహిర్గతం చేయాలి

బంగారు మునిరెడ్డి విజ్ఞప్తి

ప్రొద్దుటూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధిలో జరిగిన మున్సిపల్ అభివృద్ధి పనులలో అవినీతి జరిగిందని విజిలెన్స్ విచారణ జరిపించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి తమపై ఆరోపణలు చేసే ముందు విజిలెన్స్ విచారణ నివేదికను బహిర్గతం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాత కోట బంగారు మునిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019-2024 మధ్య జరిగిన మున్సిపల్ అభివృద్ధి పనులలో అవినీతి జరిగిందని 2024 జులై 8న సీఎం చంద్రబాబు కు లేఖ ద్వారా విజిలెన్స్ విచారణ కోరగా 20 రోజులపాటు విచారణ నిర్వహించారని ఈ నేపథ్యంలో అధికారులు ఇచ్చిన నివేదికను బహిర్గతం చేసి తమ అవినీతిని ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. అవినీతి ఏదైనా జరిగిందంటే అది వరద పాలనలోనేనన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుంటే కమిషనర్‌తో మందలించాల్సింది పోయి వత్తాసు పలకడం చూస్తే గుత్తేదారులకు ఎమ్మెల్యే మద్దతు కూడా ఉందేమో నన్ను అనుమానం ఆయన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో గత 15 నెలలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడమే కాకుండా మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండికొట్టే ప్రయత్నాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మేకల ఓబులేసు చిన్న ఓబులేసు రవికుమార్ లు పాల్గొన్నారు.

## మొంధా తుఫాన్ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

తొండూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త :



స్థానిక తొండూరు మండల పరిధిలోని గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మొంథా తుఫాను తీవ్రంగా బలపడింది. దీని ప్రభావంతో మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. బలమైన ఈదురుగాలులు వీస్తాయి. ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని మంగళవారం తహసిల్దార్ బి రామచంద్రుడు అన్నారు. ఈ నేపథ్యంలో రెవిన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తన కార్యాలయంలో ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. అత్యవసర సహాయ సమాచార నిమిత్తం ఆర్డీవో కార్యాలయం పులివెందుల 8919134718 పైన తెలిపిన కంట్రోల్ రూమ్, తొండూరు మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు కానీ 7674950741 సంప్రదించాలన్నారు.

## గ్రామాలను పరిశీలించిన అధికారులు

రాజుపాలెం, అక్టోబర్ 28, ప్రభాతవార్త:



మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం విస్తారంగా కురుస్తున్న వర్షం. గ్రామాలలో తుఫాన్ ప్రభావ పరిస్థితుల్లో పరిశీలించుటకు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తాసిల్దార్ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డిలు పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. వెలవలి గ్రామంను ఫేస్3 ప్రకటించినందున గ్రామంలోని లోతట్టు ప్రాంతాలను, ఎస్సి కాలనీని, కుందూనది తీర ప్రాంతంలో పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావంను ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారంను గ్రామంలో ఉన్న సంబంధిత అధికారులకు తెలియపరచాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పరిస్థితులను అంచనా వేస్తూ సహాయ సహకారాలు అందించాలని దీంతో పాటు మండల పరిధిలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని తెలిపారు. దీంతో పాటు మండల పరిధిలోని గాదెగూడూరు, కూలూరు, దద్దనాల, పర్లపాడు, అరకటవేముల గ్రామాల్లో కూడా అధికారులు పర్యటించి తుఫాన్ పరిస్థితిని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. మండల స్థాయి అధికారులు మండల కేంద్రంలో ఉంటూ గ్రామాల్లోని అధికారులు అందించే సమాచారంను సేకరిస్తూ వారికి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలను అందించారు. ఎస్ఐ కత్తి వెంకటరమణ పలు గ్రామాల్లో పర్యటించి తుఫాన్ పరిస్థితులను గమనిస్తూ ఎటువంటి సమస్యలు ఇబ్బందులు ఎదురైన వెంటనే మాకు తెలపాలని మీకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చిన్నమండేం అక్టోబర్ 28 ప్రభాతవార్త:

మడలంలోని చిన్నరసుపల్లి పంచాయతీలో మంగళ వారం మండల వ్యవసాయ అధికారి గీతా వరి పొలాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం మొంథ తుఫాన్ కారణం గా ముందస్తు జాగ్రత్తగా వరి లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలంలో నీరు నిలవకుండా అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. కోత దశ లో లేదా పడిపోయిన పంట లో కంకి లో మొలకలు కనబడితే 5 ఉప్పు ద్రావణం కలిపి పిచికారీ చేస్తే మొలకత్తడాన్ని మరియు రంగు మారడాన్ని నివారించవచ్చునారు.అలాగే తుపాన్ వలన పంటలకు కలిగే నష్టాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కారయక్రమంలో వి ఏ ఏ పుష్పాంజలి మరియూ రైతు ప్రసాద్, రెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గోపి దిన్నె చెరువు వద్ద జాగ్రత్తలు తీసుకోండి

తంబళ్లపల్లె అక్టోబర్ 27 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె చెరువు కురుస్తున్న భారీ వర్షాలకు నిండి మొరవ పోయింది. ఈ చెరువు మొరవ జిల్లా పరిషత్ హై స్కూల్ కు సమీపంలో ఉంది. పాఠశాల విద్యార్థులు ఈ చెరువు వైపు వెళ్ళకుండా స్థానిక ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను తల్లిదండ్రులు హెచ్చరించాలని ఎంపీడీవో పట్నాయక్, ఎం ఈ ఓ త్యాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వర్ రెడ్డి లు సూచించారు. నిండిన చెరువు దగ్గర ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు తోపాటు దీప రామా ప్రజలకు సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు.

## పశువులు ఉన్న రైతులు జాగ్రత్తలు పాటించండి

రామసముద్రం అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో పశువైద్యకారిని పావని ఆధ్వర్యంలో తుఫాన్ వల్ల పశువులు కలిగిన రైతులకు జాగ్రత్త లు గురించి సలహాలు, సూచనలు కల్పించారు. పశువులు యజమానులతో మాట్లాడుతూ తుఫాన్ వల్ల పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని ముఖ్యం గా పశువులను కరెంట్ స్థంబాలు ,పెద్ద పెద్ద వృక్షాలుదగ్గర పశువులను కట్టరాదన్నారు. గాలి, వెలుతురు కలిగిన షెడ్డు లలో పశువులను ఉంచాలన్నారు. పశువులకు ఏవైనా సమస్యలు వస్తే మాదృష్టికి తీసుకురావాలన్నారు. పశువులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంటాయని ఎల్లప్పుడూ మా సిబ్బంది మీకు అందుబాటులో ఉంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పశువైద్యరాలు పావని జె ఈవో భానుప్రకాష్, ఏ హెచ్ ఓ రమేష్, గ్రామ సచివాలయం నరేష్, సత్యనారాయణ, ప్రజలు రైతులు పాల్గొన్నారు.



## పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

దువ్వూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త:

వర్షాల వల్ల ఏవైనా పంటలు దెబ్బతిన్నాయనే ఉద్దేశంతో మంగళవారం మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి పంటలను పరిశీలించారు. నీలాపురం, మూడిళ్లపల్లె తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన మినుము, మొక్కజొన్న, కేపి ఉల్లిపంటలను పరిశీలించారు. ప్రస్తుతం ఈ మూడు పంటలు విత్తనం వేసి వారం రోజులే అయినందున పనికి రాకుండా పోతాయని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత తిరిగి సాగు చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సిద్దవటం అక్టోబర్ 28 ప్రభాతవార్త

మొంథా తుఫాన్ వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ హెచ్చరించారు. మండలకేంద్రమైన సిద్దవటం పెన్నా నదిలో నీటి మట్టాన్ని హై లెవల్ వంతెన పై నుంచి మంగళవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ పరిశీలించారు. అలాగే పెన్నానది పరివాహక గ్రామమైన వంతాటిపల్లి బీసీ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పెన్నానదిలో నీటి మట్టం పెరిగితే ముంపుకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు కు సూచించారు. అలాగే పెన్నానదిలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈదురు గాలులు బలంగా వీచినప్పుడు రేకుల షెడ్లు, పూరి గుడిసెల్లో నివాసం ఉన్నవారిని పునరావాస ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలలో భోజనం, నీటి వసతి, టాయిలెట్స్ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అధికారులందరూ తప్పకుండా పాటించి ప్రజలకు ఎలాంటి ప్రాణ, అస్తి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## మరో ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్ట్



మదనపల్లెక్రైమ్, అక్టోబర్ 28 ప్రభాతవార్త.

మదనపల్లె కేంద్రంగా గంజాయి విక్రయిస్తున్న మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు డిఎస్పి మహేంద్ర తెలిపారు. రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఇద్దరు అరెస్ట్ చేసిన విషయం తెలిసింది, మంగళవారం ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలో డి.ఎస్.పి మహేంద్ర, రూరల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, దిలీప్ కుమార్ నిందితులను అరెస్ట్ చూపించారు. పెద్దమండెం మండలం బండ్రేవ్ పంచాయతీ కొత్త పల్లికి చెందిన లేట్ వెంకటరమణ నాయక్ కుమారుడు మూడే మణికంఠ నాయక్(19) గత కొన్ని నెలలుగా మదనపల్లి పట్టణం చంద్ర కాలనీలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. నా పల్లి మండలం పోతబోలు పంచాయతీ కురవపల్లి చెందిన గోవిందు (67) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరూ ఆదివారం గ్రూపులకోట సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు చూసి పదాలు కావడానికి ప్రయత్నిస్తుండగా దిలీప్ కుమార్ వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీచేగా వారి వద్ద రెండు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిద్దరిని రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గంజాయి సేవించిన పలువురిని గుర్తించి మొదటి తప్పుగా భావించి వారిని చిత్తూరులోని రిహాబిటేషన్ సెంటర్ కు నుంచి కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. గంజాయి సరఫరాలో ఇంకా ప్రమేయం ఉన్న వారిని గుర్తించి అరెస్ట్ చేస్తామన్నారు. గంజాయి విక్రయ దారుణం అదుపులోకి తీసుకోవడానికి కృషిచేసిన ఎస్సై దిలీప్ కుమార్, హెడ్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్స్ రెడ్డి శేఖర్, సిద్దేశ్వర, చక్రపాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రసాద్ లను డి.ఎస్.పి, సిఐ సత్యనారాయణలో అభినందించారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి యోగ దోహదపడుతుంది



బద్వేలు, అక్టోబర్ 28, ప్రభాతవార్త

శ్రీ బిజముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం 1వయూనిట్ తరపున దత్తత గ్రామమైన చిన్నకేశంపల్లెలో స్పెషల్ క్యాంపు ఏడవ రోజు ముగింపు కార్యక్రమంలో యోగపై అవగాహన కార్యక్రమాన్ని యూనిట్ సమన్వయకర్త డాక్టర్ ఎమ్. దొరస్వామి నాయక్ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి యోగ పై అవగాహన కల్పించారు. యోగ శారీరక,మానసిక వికాసానికి దోహదపడుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ యోగ మానవ జీవితంలో సంపూర్ణ ఆరోగ్య రక్షణకి దోహదపడుతుందని, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానవుడు యాంత్రికంగా తయారయ్యాడని, విలాసవంతమైన జీవితం కొరకు డబ్బును సంపాదించాలనే ప్రయత్నంలో భాగంగా చేతులారా ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నాడని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. అనంతరం స్పెషల్ క్యాంపులో పాల్గొన్న వాలంటీర్లకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సి.హెచ్. ఈశ్వరయ్య, ఆర్. ప్రేమ్‌కుమార్, పి. రత్నమయ్య, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

## పారిశుద్ధం పర్యవేక్షణలపై అప్రమత్తంగా ఉండండి



పెద్దమండెం అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలో పారిశుద్ధం డ్రైనేజీ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిపిఓ జిల్లా పంచాయతీ రాజ్ ఆఫీసర్ రాధమ్మ అన్నారు మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో పరిసరాలు పరిశుభ్రత డ్రైనేజీలు నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు డ్రైనేజీల లో లోరినేషన్న చేసి వ్యాధుల ప్రబలకుండా చూడాలన్నారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు అలాగే దోమల వల్ల పరిశుభ్రలు లేకుంటే వచ్చే రోగాలను వాటి వల్ల కలిగే హానిని ప్రజలకు వివరించాలన్నారు చెత్త నుండి సంపదను సృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్మీ కంపోస్ట్ షెడ్ లో పొడిచెత్త తడి చెత్త సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు గ్రామాల్లో చేస్తున్న పనులను ఫోటోలు తీసి అప్లోడ్ చేసి ఆన్లైన్లో పొందుపరచాలన్నారు ఉన్నతాధికారులు పర్యవేక్షించి వాటిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్గానిక్ వేస్టేజ్ లను తొలగించాలన్నారు మండలంలో మెంత తుఫాన్ ఉంచి ఉందని దాని బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఎలాంటి హాని జరగకుండా చూడాల్సిన బాధ్యత కార్య దర్శిలదేనని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## శ్రీ భవాని శంకరునికి పెసలతో అలంకారం

చిట్వేలి, అక్టోబర్ 28, ప్రభాతవార్త:

మంగళవారం స్థానిక చిట్వేలి మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో శ్రీ భవాని శంకర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అర్చన, ప్రదోషకాల పంచామృత అభిషేకంతో పాటు సాయంత్రం స్వామివారి మూల విగ్రహానికి పెసలతో విశిష్ట అలంకారంను అర్చకులు అరవింద శర్మ చేపట్టారు. తదుపరి స్వామివారికి ఉయ్యాల సేవ నిర్వహించారు.

## అంతర్జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ



రాజంపేట, అక్టోబర్28 ప్రభాతవార్త

అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఈసిఈ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం లభించింది. పంజాబ్ రాష్ట్రంలోని మోహాలిలో ఉన్న చండీగఢ్ ఇంజినీరింగ్ కాలేజ్ – సిజిసి లాండ్రన్ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1వ అంతర్జాతీయ సదస్సు ఆన్ అడ్వాన్స్డ్ సస్టైనబిలిటీ నిర్వహించారు. ఈ సదస్సులో అన్నమాచార్య విశ్వవిద్యాలయం రాజంపేట ఈసిఈ విభాగానికి చెందిన విద్యార్థులు నల్లపురెడ్డి గారి హేమలత, దుదేకుల అమితాబి, వెన్నపుస భాను ప్రకాష్ రెడ్డి, మడ్డక ధనంజినేయులు "మాస్క్డ్ అవేర్ ఎమోషన్ రికగ్నిషన్ అండ్ డిప్రెషన్ అసెస్‌మెంట్ యూజింగ్ మొబిలిసేనెట్" అనే పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈ పత్రానికి బెస్ట్ పేపర్ అవార్డు లభించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచింది. ఈ పరిశోధనకు మార్గదర్శకుడిగా డా. షేక్ కరీముల్లా పనిచేశారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి, విభాగాధిపతి డా. జె. చిన్నబాబు, ప్రొఫెసర్ డా. సి.హెచ్. నాగరాజు విద్యార్థులను అభినందించారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఓబిసి అధ్యక్షులు జబ్బల



మదనపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సౌత్ ఇండియా ఓబిసి అధ్యక్షులు, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు మంగళవారం హైదరాబాదులో కలిసి సన్మానించారు. ఈనెల 12 న జరిగిన ఓబీసీ సెమినార్ కార్యక్రమం యొక్క జ్ఞాపికను సత్కరించి అందించడం జరిగినది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ఓబిసి సంక్షేమాల కొరకు తామెప్పుడూ సౌత్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ వెంట ఉంటామని, నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్షులైన నన్ను నా సహచర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ను సత్కరించి జ్ఞాపికలు అందజేసారు తన వెంట ఎల్లవేళలా ఉన్న నేను సౌత్ ఇండియా ఓ బి సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిని కావడం చాలా సంతోషకరమని తెలియజేశారు. అలానే రాబోవు కాలంలో కూడా అందరం కలిసి ఓబీసీల అభివృద్ధి సాధనకై కృషి చేద్దామని తెలియజేశారు. తదనంతరం ప్రొఫెసర్ కోదండరాం ను సత్కరించి జ్ఞాపికను అందజేసారు. కోదండరాం ఎల్లవేళలా ఓబీసీల వెంట ఉంటూ వారి అభివృద్ధికి తాను సైతం సౌత్ ఇండియా ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వెంట ఉంటానని తెలియజేశారు. అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ కేజీ కృష్ణమూర్తి కలిసి సత్కరించి జ్ఞాపికను అందజేయగా, రాబోవు కాలంలో ఓబీసీ కులాలవారు అన్ని వర్గాలలో రాణించాలని అలానే ముఖ్యంగా న్యాయవ్యవస్థలో మరింత ప్రతిభ చూపించాలని కోరారు.

## కువైట్‌లో భారత రాయబారిని కలిసిన ఎమ్మెల్యే

### మహిళను స్వగ్రామానికి తరలింపు





రాజంపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త

ప్రవాస భారతీయులు కువైట్‌లో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇటీవల భారత రాయబార కార్యాలయాన్ని మదనపల్లి మ్మెల్యే షాజహాన్ భాషా, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు కంచన రెడ్డిశేఖర్, రాశీదాలు సందర్శించారు. కువైట్‌లోని గౌరవ భారత రాయబారి అయిన సంజయ్ ని కలిసిన సందర్భంలో ప్రవాస భారతీయ మహిళ నాగమణి గత కొంత కాలంగా హాస్పిటల్ చికిత్స పొందుతున్న ఆమెను త్వరగా కోలుకొన్న తర్వాత ఆమె ను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేసి (ఇండియా)వాళ్ల సొంత గ్రామానికి తరలించమని కోరారు. తదనంతరం ఆమె కోలుకోవడంతో స్వగ్రామానికి తరలించారు. ఇందుకు భారత రాయబార కార్యాలయానికి, అంబాసిడర్ సంజయ్, మదనపల్లి ఏ మ్మెల్యే షాజహాన్ భాషాకి రెడ్డి శేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## అత్యాధునిక చికిత్సల ద్వారా బ్లడ్ క్యాన్సర్ నయం

కడప కార్పొరేషన్ అక్టోబర్ 28 ప్రభాతవార్త:




బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తామని హెమటాలజిస్ట్, బిఎండి ఫిజిషియన్ డా.గణేష్ జైషెట్వార్ అన్నారు. బ్లడ్ క్యాన్సర్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే హెమటాలజిస్ట్ ను సంప్రదించాలని సూచించారు. మంగళవారం కడప ఎర్రముక్కపల్లిలో యశోద హాస్పిటల్స్ సమాచార కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైద్య శాస్త్రంలో కృషి చేసిన శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రపంచ ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్యాన్సర్ వ్యాధిలో ల్యుకేమియా, లింఫోమా, మైలోమా మూడు రకాలు ఉన్నాయన్నారు. మొదటి రెండు పిల్లలు, పెద్దలకు వస్తే.. మైలోమా పెద్దవాళ్లలోనే ఎక్కువగా కనిపిస్తుంది. అక్యూట్ లింఫోబ్లాస్టిక్ ల్యుకేమియా (ఎఎల్ఎల్) 10 ఏళ్లలోపు వారికి వస్తుంది. ఎఎల్ఎల్ ఉన్నప్పుడు లింఫ్ గ్రంథులన్నీ వాచిపోయి, ఎముకల నొప్పులు, అలసట, హిమోగ్లోబిన్ తగ్గడం, చెమట, జ్వరం వస్తుందన్నారు. అక్యూట్ మైలాయిడ్ ల్యుకేమియా ఉన్న 70 శాతం పిల్లలకు బిఎంటి అవసరం. కీమో వల్ల 30 శాతం తగ్గితే, 70 శాతం బిఎంటి వల్ల తగ్గుతుందని చెప్పారు. మైలోమా పెద్ద వయసు వారికి ప్లాస్మా కణాల్లో వచ్చే వ్యాధి అన్నారు. గత 25 సంవత్సరాలగా బ్లడ్ క్యాన్సర్ చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. రక్త క్యాన్సర్ బారిన పడిన అనేక మందికి చికిత్స అందించి నయం చేసినట్లు చెప్పారు.

## ప్రొద్దుటూరులో పెన్నానదిని పరిశీలించిన ఆర్డీవో

ప్రొద్దుటూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త

మైలవరం జలాశయం నుండి పెన్నా నదికి ఐదువేల క్యూసెక్కుల నీటిని వదలడంతో పట్టణంలోని రామేశ్వరంలో వున్న పెన్నా నది ఉధృతిని ఆర్డిఓ సాయిశ్రీ తాసిల్దార్ గంగాధర్ పరిశీలించారు. మంగళవారం మండలంలోని రామేశ్వరం, చౌడూరు గ్రామాలలో పెన్నా నది ప్రవాహాన్ని పరిశీలించి ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ప్రొద్దుటూరు నుండి ఆర్టీపిపి కి వెళ్ళు దారి పైకి నీరు వచ్చే వారు జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు.



## మదనపల్లికి తప్పిన తుఫాన్ ముంపు

### ఊపిరి పీల్చుకున్న అధికారులు

మదనపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త

మదనపల్లి రెవిన్యూ డివిజన్ కు ముంత తుఫాన్ ముంపు తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత మూడు రోజులుగా తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు హైరానా పడ్డ విషయం తెలిసిందే. ఈ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడతాయి అన్న నెపంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు తుఫాన్ ప్రభావం తేట తెల్లం కావడంతో ఇటు ప్రజలు అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఇలాంటి తుఫాను ప్రభావంతోనే మదనపల్లి అతలాకుతలమైన విషయం తెలిసిందే. మళ్లీ అలాంటి ప్రభావం పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగింది. తుఫాన్ తీరం దాటే సమయంలో మదనపల్లి రెవెన్యూ డివిజన్ కు ఎలాంటి ప్రభావం చూపకపోవడం విశేషం. తుఫాన్ ను అన్ని విధాల ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధమైనారు. రెండు రోజులుగా మదనపల్లి రెవెన్యూ డివిజన్లో నామమాత్రంగా వర్షాలు పడ్డాయి తప్ప భారీ వర్షాలు పడిన దాఖలాలు లేవు. బుధవారం ఏమైనా వర్షాలు పడే అవకాశం కూడా లేనట్లు అధికారులు తెలిపారు. ఏదేమైనా తుఫాను ప్రభావం మదనపల్లికి తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తుఫాను పై గత మూడు రోజులుగా అధికారులు చేసిన ప్రచారం ఇంత అంతా కాదు. తుఫాన్ చిరు జల్లులతోనే సర్దుకుంది.

## ముంచుకొస్తున్న తుఫాన్



నిమ్మనపల్లి అక్టోబర్ 28 ప్రభాత వార్త

నిమ్మనపల్లి మండలంలో తరుముకొస్తున్న మెంత తఫాన్ వల్ల ఏర్పడే విపత్తు ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం మూడు రోజులుగా కృషి చేస్తోంది వర్షాలకు చెరువులు వంకలు నిండుకుండలా పొంగిపొర్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా పడితే చెరువులు కుంటలు తెగిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా మండల అధికారులు ముందస్తుగా పలు పటిష్టమైన చర్యలు తీసుకుంది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజల కోసం మండలంలోని కస్తూరిబా పాఠశాల తెలుగు హై స్కూల్ మోడల్ స్కూల్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. తహసిల్దార్ కార్యాలయం ఎంఆర్సి కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసింది పాఠశాలలకు సెలవులు ప్రకటించడం జరిగింది. తుఫాన్ అప్రమత్తంపై అధికారులు తహసిల్దార్ తేజస్విని ఆర్ ఐ రమేష్ ఎంపీడీవో రమేష్ ఎస్సై తిప్పే స్వామి ఎంఈఓ పద్మావతమ్మ నారాయణ అధికారులు మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అంతేకాకుండా ముంపు ప్రాంతాలను మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర రూరల్ సీఐ సత్యనారాయణ లు పర్యటిస్తున్నారు తుఫాన్ తో పంటలు టమోటా వరి మొక్కజొన్న వంటి రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ వర్షంతో పాడి పశువులు కూడా అవస్థలు పడుతున్నాయి.

## తుఫాను పరిస్థితులు తట్టుకునేందుకు సర్వం సిద్ధం



బద్వేలు, అక్టోబర్ 28 (ప్రభాతవార్త)

భారీ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లన్నింటిని పూర్తి చేసినట్లు బద్వేలు తహశీలారు ఉదయభాస్కర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పరిధిలోని గూడెం, రఘునాథపురం, వీరబల్లి, కొంగళవీడు, పుట్టాయపల్లి, గొడుగునూరు, తొట్టిగారిపల్లె ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా వారిని రక్షించేందుకు సమీపంలోని పాఠశాలలు, సచివాలయాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఆయా భవనాలలో ప్రజలకు అవసరమైన తాగునీటి సౌకర్యం, భోజన వసతులకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, ఇందులోభాగంగా అగ్రహారం సమీపంలో హైవే అధికారులు వంతెన నిర్మాణం కోసం చెరువులు పూడ్చిన నేపథ్యంలో గూడెం, రఘునాథపురం, తదితర ప్రాంతాలకు సమస్యలు తలెత్తుతాయని అధికారులు5 గుర్తించారు. అందుకే తీసిన గుంతలను జేసీబీలతో పూడ్చివేసి వర్షపునీటిని సమీపంలోని నాగుల చెరువులోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువలు ఏర్పాటు చేయించారు. ఈ పనులు బద్వేలు తహశీల్దారు దగ్గర ఉండి మరమ్మతులు చేపట్టారు. మండల పరిధిలో తుఫాన్ కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సహాయక చర్యలు అందించేందుకు రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా బద్వేలు రెవెన్యూ డివిజన్ అధికారి టోల్ ఫ్రీ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉం టాయని అవసరమైతే వాటిసేవలను కూడా అందుకోవచ్చన్నారు. తుఫాన్ సమయంలో చెరువులు, వాగుల వద్దకు వెళ్లరాదని సూచించారు.

## బాధితులకు పక్కా ఇల్లు నిర్మిస్తాం

### మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేల్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలం సావిశెట్టి పల్లె గ్రామంలో భారీ వర్షం కారణంగా ఎస్సీ కాలనీలో 30 కుటుంబాలకు చెందిన మట్టి మిద్దెలు, బోధ కొట్టాలు వర్షానికి కూలిపోయాయి. విషయం తెలుసుకున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ వారికి ధైర్యం చెప్పి ప్రభుత్వ ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వెంటనే బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ కు ఫోన్ ద్వారా దుస్థితిని వివరించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వర్షం తగ్గిన వెంటనే బాధితులకు పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. అనంతరం బాధితులకు దుప్పట్లు, బిస్కెట్లు, వాటర్ బాటిల్లు అందజేశారు. సుమారు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన మిద్దెలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి వర్షాలు తగ్గిన వెంటనే పక్కా ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. వారికి కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని తాము అన్ని విధాల అండగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఆమె దృష్టికి వచ్చిన పలు సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వివరించి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటసుబ్బయ్య, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ బంగారు గురువిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ సగిలి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, పంగా రవీంద్రారెడ్డి, రోహిత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, చెన్నారెడ్డి, చిన్న రమణారెడ్డి గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆంజనేయ స్వామికి విశేష పూజలు





బద్వేలు అర్బన్ అక్టోబర్ 28 ప్రభాతవార్త :

బద్వేలు పట్టణం సిద్దవటం రోడ్ లో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని మంగళవారం ఆలయ పూజారి వీరేశచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది, కార్తీకమాసం సందర్భంగా తెల్లవారుజాము నుండి పలువురు భక్తులు చన్నిటి స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు, ప్రత్యేక అభిష్నేక ఉభయ దాతలుగా ప్రముఖ వ్యాపారవేత్త పబ్బతి సత్య నారాయణ సతీమణి శ్రీదేవి కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వహకులు వల్లంకొండు వెంకట రమణ మరియు పలువురు కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే ....గతి

### నడిరోడ్డుపై గుంతలతో వాహనదారులు



బద్వేల్ అర్బన్ అక్టోబర్ 28 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్డు ఎస్ఎంఆర్ చికెన్ సెంటర్ మెయిన్ రోడ్డు వద్ద గత 20 రోజులుగా ప్రధాన రహదారులలో రోడ్డు మరమ్మతులకు గురై సుమారు2, అడుగులు లోతు పైగా గుంతలు ఉండడంతో ఆ రహదారులలో వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు సైతం రావాలంటేనే అనేక ఇబ్బందులకు గురికాల్సిన పరిస్థితి అక్కడ నెలకొంది, ముఖ్యంగా గత కొద్ది రోజుల నుండి పడుతున్న వర్షాలతో ప్రధాన రహదారుల్లో గుంతల్లో పూర్తిస్థాయిలో నీరు ఉండడం వలన ఒక్కసారిగా వాహనాలు గుంతలో పడి పూర్తిస్థాయిలో డ్యామేజీ అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు, అనునిత్యం ఈ రహదారిలో రద్దీగా అనేకమంది నాయకులు, అధికారులు తిరుగుతూ ఉంటూనే ఉంటారు అయితే అక్కడ ప్రధాన రహదారిలో గుంతలకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో పలువురు వాహనదారులు, ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు, ఇప్పటికైనా సంబంధించిన అధికారులు కానీ నాయకులు కానీ చొరవ తీసుకొని సిద్ధవటం, మైదుకూరు రోడ్డు పోరుమామిళ్ల రోడ్డు లో పలు ఏరియాలలో గుంతలను పూడ్చి వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



గాలివీడు, అక్టోబర్ 28(ప్రభాతవార్త):

రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమావరం గోరాన్‌చెరువు పంచాయతీలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నరెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సంబేపల్లి, చిన్నమండెం, రాయచోటి రూరల్ మండలాలల్లోని 700 పైబడి పల్లెలకు వెలిగల్లు జలాశయం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి జల్ జీవన్ మిషన్ కింద రూ.400 కోట్లతో పనులు ప్రారంబించనున్నట్లు తెలిపారు. 270 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే రూ.30 కోట్లతో అనేక గ్రామాల్లో మంచినీటి బోర్లు వేశామని పేర్కొన్నారు. గాలివీడు మండలంలోని ప్రతి పల్లెకు మొదటి ప్రాధాన్యత కింద నీటిసౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రజలు భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తుఫాను ప్రభావం వల్ల నష్టం జరగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నదని తెలిపారు. ఇక గోరాన్‌చెరువులో సిమెంట్ రోడ్డును ప్రారంభించిన అనంతరం మంత్రి సమక్షంలో మాజీ సర్పంచ్ దాసరి నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కొత్తగా చేరిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు డా.మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు తెలుసుకున్న బిజెపి నాయకుడు

బద్వేలు అర్బన్ ,అక్టోబర్ 28, ప్రభాతవార్త

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తమ్మించిన విషయం తెలిసిందే. నేపథ్యంలో మంగళవారం బద్వేల్ నియోజకవర్గ బిజెపి నాయకులు పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి సోమశిల ప్రాజెక్టు వెనుక జలాల పరివాహక ప్రాంతమైన వైయస్సార్ కడప జిల్లా గోపవరం మండలంలోని కొన్ని లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. కొన్ని గ్రామాలు జలదిగ్బంధం లో చిక్కుకొని ఉండడంతో ఆ ప్రాంత అధికారుల ద్వారా ప్రజలకు అందుకున్న సహాయక వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ నాయకుడిగా ఆ ప్రాంత సమస్యపై స్పందించి 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు దుప్పట్లు మరియు తిను బండారాలను పంచిపెట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటనలు ప్రజలు గమనిస్తూ అవసరమైతే స్థానిక అధికారులకు సమస్యను తెలియజేయాలని, ఉండాలని మెంతా తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్నందున ప్రజలు బయటికి రావద్దని, జాలర్లు చేపలు వేటకు వెళ్ళద్దని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు అధైర్యపడవద్దని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు.

